




జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు








శుక్రవారం 24 ఏప్రిల్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 326 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్


## పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఎన్నికల ప్రచారంలో నేతల వ్యాఖ్యలు

### హౌరా రోడ్‌షోకు భారీ స్పందన – మార్పు కోరుతున్న ప్రజలు స్పష్టంగా కనిపిస్తున్నారన్న వ్యాఖ్యలు





సందేశం టైమ్స్, ఏప్రిల్ 24, ప్రతినిధి: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తొలి దశ పోలింగ్ సందర్భంగా ఓ జాతీయ రాజకీయ నాయకుడు ప్రజాస్వామ్య ఉత్సవంలో పెద్ద సంఖ్యలో ఓటర్లు పాల్గొనాలని, ముఖ్యంగా యువత, మహిళలు అధిక సంఖ్యలో ఓటు వేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కూడా ఓటర్లు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. మరో ప్రచార కార్యక్రమంలో క్రిష్ణనగర్ ప్రాంత ప్రజల్లో ప్రభుత్వ పాలనపై అసంతృప్తి వ్యక్తమవుతోందని, అవినీతి, నిర్లక్ష్యంపై విమర్శలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. హౌరా ప్రాంతంలో నిర్వహించిన రోడ్ షోకు భారీ స్పందన లభించిందని, ఆ ఉత్సాహం కోల్‌కతా వరకు కొనసాగిందని తెలిపారు. ఎన్నికల వేళ మార్పు కోసం ప్రజల్లో ఆకాంక్ష కనిపిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు.

## ఆర్టీసీ సమ్మెపై మంత్రివర్గం కీలక నిర్ణయాలు చర్చలకు ప్రభుత్వం ఆహ్వానం






సందేశం టైమ్స్, ఏప్రిల్ 24, ప్రతినిధి: ఆర్టీసీ కార్మికులు కొనసాగిస్తున్న సమ్మెపై రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సుదీర్ఘంగా చర్చించి సమస్యల పరిష్కారానికి చర్చల ద్వారానే ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. కార్మికులు సమ్మెను విరమించి చర్చలకు రావాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. రేపు (శుక్రవారం) ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రుల బృందం కార్మిక సంఘాలతో చర్చలు జరపనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సచివాలయంలో జరిగిన సమావేశంలో ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలపై సానుకూల దృక్పథంతో ఉందని స్పష్టం చేశారు. చర్చల ద్వారా అన్ని సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నట్లు మంత్రులు పేర్కొన్నారు. అదే సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై పీసీ ఘోష్ కమిషన్ నివేదిక, హైకోర్టు తీర్పు విషయాలను కూడా చర్చించి న్యాయనిపుణుల అభిప్రాయాల అనంతరం తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల బకాయిలు, ఆర్థిక సమస్యలపై కూడా చర్చించి అవసరమైన నిధుల సమీకరణ కోసం ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని మంత్రివర్గం నిర్ణయించింది. అలాగే హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియం అభివృద్ధి, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు భూసేకరణ, శ్రీపాద ఎల్లంపల్లి వద్ద అక్వా పార్క్ ఏర్పాటు వంటి ప్రతిపాదనలకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు.



## అనకాపల్లి జిల్లాలో భారీ పెట్టుబడులు రీన్యూ సోలార్ ప్రాజెక్ట్‌కు భూమి పూజ






సందేశం టైమ్స్, ఏప్రిల్ 24, ప్రతినిధి: అనకాపల్లి జిల్లాలో భారీ పరిశ్రమల పెట్టుబడులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే రూ.1,36,000 కోట్ల పెట్టుబడితో ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగిన నేపథ్యంలో, తాజాగా రూ.5,400 కోట్ల పెట్టుబడితో 2,100 ఉద్యోగాలను కల్పించే రీన్యూ సోలార్ ప్రాజెక్ట్‌కు భూమి పూజ నిర్వహించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా దేశీయ సోలార్ తయారీ రంగం బలోపేతం అవుతుందని, దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుందని పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లాను భవిష్యత్తులో అభివృద్ధి పరంగా రంగారెడ్డి జిల్లాతో సమానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు సంబంధితులు తెలిపారు.సుప్రీంకోర్టు న్యాయమూర్తి లీసా గిల్‌కు అభినందనలు

అదే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ నియమితులైనందుకు హర్షం వ్యక్తమైంది. న్యాయవ్యవస్థలో మహిళల ప్రాతినిధ్యం పెరగడంలో ఇది చారిత్రక ఘట్టమని పేర్కొన్నారు.విద్యుత్ సంస్థలపై భారీ భారం – రాజకీయ విమర్శలు మరోవైపు 2019–24 మధ్య కాలంలో విద్యుత్ సంస్థలపై భారీ ఆర్థిక భారం పడిందని, ధరల పెంపుతో ప్రజలపై అదనపు భారం మోపబడిందని ఆరోపణలు వ్యక్తమయ్యాయి.

## కాళేశ్వరం కమిషన్ నివేదికపై హైకోర్టు తీర్పు అంశాన్ని కేబినెట్‌లో వివరించిన అడ్వకేట్ జనరల్ – మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలు

హైదరాబాద్, ఏప్రిల్ 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కాళేశ్వరం ప్రాజెక్టు కమిషన్ నివేదికకు సంబంధించి కేసీఆర్, హరీష్ రావు సహా కొందరు అధికారులు హైకోర్టును ఆశ్రయించిన అంశంపై జరిగిన పరిణామాలను రాష్ట్ర కేబినెట్‌లో అడ్వకేట్ జనరల్ వివరించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. జస్టిస్ ఘోష్ కమిషన్ చట్టవిరుద్ధమని పిటిషనర్లు వాదించినప్పటికీ, కమిషన్ ఏర్పాటు చట్టబద్ధమేనని హైకోర్టు స్పష్టంగా పేర్కొన్నదని ఆయన వివరించారు. కమిషన్ నివేదికను రద్దు చేయాలన్న అభ్యర్థనను కూడా కోర్టు అంగీకరించలేదని, అయితే సెక్షన్ 8 ప్రకారం సంబంధిత వ్యక్తులపై తక్షణ చర్యలు తీసుకోవద్దని మాత్రమే సూచించిందని తెలిపారు. కోర్టు ఎక్కడా వారిని నిర్దోషులుగా ప్రకటించలేదని మంత్రి పేర్కొంటూ, ఈ తీర్పుపై బీఆర్ఎస్ నేతలు సంబరాలు చేసుకోవడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు.

## జాతీయ స్థాయిలో అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ విభాగం




సందేశం టైమ్స్, ఏప్రిల్ 24, ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జాతీయ స్థాయిలో అగ్రగామిగా నిలిచినట్లు అధికారికంగా వెల్లడైంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో చేపట్టిన సంస్కరణలు, పారదర్శక పాలనతో గ్రామీణ పాలన వ్యవస్థకు కొత్త దిశ లభించిందని పేర్కొన్నారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ ర్యాంకింగ్స్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 24వ స్థానం నుంచి మొదటి స్థానానికి చేరుకోవడం విశేషంగా పేర్కొనబడింది.గ్రామ సభల నిర్వహణ, ఉపాధి హామీ పనుల ప్రణాళిక, ఉద్యోగులకు పదోన్నతులు, గ్రామీణ రహదారుల నిర్మాణం, స్వచ్ఛత కార్యక్రమాలు, డిజిటల్ పాలన వంటి చర్యలతో గ్రామీణాభివృద్ధిలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని సమాచారం. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు, పారదర్శక పాలనతో ప్రజల్లో విశ్వాసం పెరిగిందని అధికారులు తెలిపారు.జాతీయ స్థాయి అవార్డుల్లోనూ ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ విభాగం విశేష ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. మహిళా స్నేహపూర్వక పంచాయతీ, సుపరిపాలన, జీవనోపాధి, మౌలిక సదుపాయాల విభాగాల్లో పలు గ్రామ పంచాయతీలు దేశంలో అగ్రస్థానాలు సాధించాయి. గ్రామాల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అధికారులు తెలిపారు.

## ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి ఘటనపై రాజకీయ ప్రతిపక్షాల విమర్శలు – ప్రభుత్వ నిర్లక్ష్యం ఆరోపణలు




హైదరాబాద్, ఏప్రిల్ 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి చెందిన ఘటనపై రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. సమ్మె నేపథ్యంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఈ దుర్ఘటన జరిగిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లనే శంకర్ గౌడ్ తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడి అనంతరం మృతి చెందారని వారు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, కార్మికుల సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరుగుతోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ ప్రభుత్వమే తక్షణ చర్యలు తీసుకుని ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని ప్రతిపక్ష నాయకులు కోరుతున్నారు.

## నల్లపోచమ్మ జాతరలో ఉచిత వైద్య శిబిరం ప్రారంభం – భక్తులకు సేవలు అందుబాటులో




సందేశం టైమ్స్, మనూర్ మండల్, ఏప్రిల్ 24, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా మనూర్ మండలంలోని బోరంచ గ్రామం శ్రీ శ్రీ శ్రీ నల్లపోచమ్మ తల్లి దేవస్థానం వద్ద ప్రారంభమైన 7 వారాల మహా జాతర సందర్భంగా వెల్‌నెస్ హాస్పిటల్స్ సంగారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో భక్తులకు షుగర్ పరీక్షలు, బీపీ తనిఖీలు నిర్వహించడంతో పాటు అవసరమైన మందులను అందిస్తున్నారు. జాతర కాలంలో ప్రతి గురువారం ఈ మెడికల్ క్యాంప్ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు అత్యవసర పరిస్థితుల్లో ఈ సేవలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. శిబిర ప్రారంభ కార్యక్రమంలో హాస్పిటల్ వైద్యులు, మనూర్ ఎస్ఐ, పోలీస్ సిబ్బంది, ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ సిబ్బందికి శుభవార్త – రూ.కోటి ప్రమాద బీమా, రూ.78 కోట్ల వేతన బకాయిల విడుదల

సందేశం టైమ్స్, నారాయణ ఖేడ్, ఏప్రిల్ 24, ప్రతినిధి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలోని సుమారు 3,700 మంది సిబ్బందికి రూ.40 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉచిత వ్యక్తిగత ప్రమాద బీమా సౌకర్యం కల్పించనుండగా, ఎస్‌బీఐతో కుదుర్చుకున్న కార్పొరేట్ శాలరీ ప్యాకేజీ ఒప్పందం ప్రకారం ఈ బీమా అమలులోకి రానుంది మరియు దీనికి ఉద్యోగులు లేదా ప్రభుత్వం ఎటువంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదని వెల్లడించారు. అదేవిధంగా జనవరి నుంచి మార్చి వరకు 11,760 మంది సిబ్బందికి సంబంధించిన వేతన బకాయిల కింద రూ.78 కోట్లు విడుదల చేయగా, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న కూలీలకు సంబంధించి రూ.383 కోట్ల బకాయిలను వారం రోజుల్లో ఖాతాల్లో జమ చేయనున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రకటించింది. ఇదే సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్లను ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగులుగా గుర్తించాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. రాజిరెడ్డి ప్రభుత్వాన్ని కోరుతూ పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ దివ్యకు వినతిపత్రం సమర్పించారు.

## సంగారెడ్డి జిల్లాలో NIMZ ప్రాజెక్ట్ ప్రాంతాన్ని కలెక్టర్ సందర్శన



సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా, ఏప్రిల్ 24, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఇటీవల NIMZ ప్రాజెక్ట్ ప్రాంతాన్ని సందర్శించి ప్రాజెక్ట్ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా పనుల స్థితిగతులను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ప్రాజెక్ట్ వేగవంతంగా పూర్తి చేయాలని, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్, జీఎం NIMZ, జహీరాబాద్ ఆర్డీవో, ఝరాసంగం మండల తహసీల్దార్ తదితర అధికారులు పాల్గొన్నారు.




## బోరంచ నల్లపోచమ్మ జాతర ప్రారంభం – ఎమ్మెల్యే సంజీవరెడ్డి దర్శనం, ప్రత్యేక పూజలు

సందేశం టైమ్స్, మనూర్ మండల్, ఏప్రిల్ 24, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మానూర్ మండలం బోరంచ గ్రామంలో వెలసిన శ్రీ నల్లపోచమ్మ అమ్మవారి ఏడు వారాల జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగుండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఏప్రిల్ 23 నుంచి జూన్ 4 వరకు జరిగే ఈ జాతరకు పక్క రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివస్తారని పేర్కొంటూ, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, నీడ, పారిశుధ్యం వంటి వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్‌ను పరామర్శించిన డీఎస్పీ శివరాం రెడ్డి – సమ్మె ఉద్రిక్తత కొనసాగింపు



సందేశం టైమ్స్, నల్గొండ, ఏప్రిల్ 24, ప్రతినిధి: ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో నల్గొండ ఆర్టీసీ బస్టాండ్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన డ్రైవర్ రావుల వెంకన్నను డీఎస్పీ శివరాం రెడ్డి పరామర్శించారు. బాధితుడితో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్న ఆయనకు కార్మికుడు తన ఆవేదనను వ్యక్తం చేస్తూ తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరాడు. లేదంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించాడు. ఘటనపై సమగ్ర సమాచారం సేకరించిన డీఎస్పీ పరిస్థితిని సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## సమ్మె విరమించకపోతే కఠిన చర్యలు: ఆర్టీసీ యాజమాన్యం హెచ్చరిక

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రతినిధి: ఆర్టీసీ సిబ్బంది కొనసాగిస్తున్న సమ్మెపై యాజమాన్యం కఠిన వైఖరి వ్యక్తం చేస్తూ, పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారం వివాదం పెండింగ్‌లో ఉన్న సమయంలో సమ్మెకు దిగడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. సమ్మె కొనసాగితే చట్టవిరుద్ధంగా పరిగణించి ఉద్యోగులపై వేతన కోతలతో పాటు క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ప్రజలకు రవాణా సేవలు అంతరాయం కలగకుండా కొనసాగించడం ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించింది. జీతాలు, భత్యాలు, ఉద్యోగ భద్రత, పని పరిస్థితులపై ఉన్న అసంతృప్తి కారణంగానే సిబ్బంది సమ్మె కొనసాగిస్తున్నట్లు భావిస్తున్న యాజమాన్యం, పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వెంటనే సమ్మెను విరమించి విధుల్లో చేరాలని టీజీఎస్ ఆర్టీసీ చైర్మన్ వై. నాగిరెడ్డి సిబ్బందికి విజ్ఞప్తి చేశారు.

## బోరంచలో చలి వేంద్రం ప్రారంభం – హన్మంతు, హరి కృష్ణ ఆధ్వర్యం



సందేశం టైమ్స్, మనూర్ మండల్, ఏప్రిల్ 24, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండలంలోని బోరంచ గ్రామం (పాపమాగడ్డ) సమీపంలో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఉపశమనం కలిగించే ఉద్దేశంతో చలి వేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఎంఎస్‌డీ చిట్ ఫండ్స్, శ్రీ మొబైల్ కేర్ ఆధ్వర్యంలో హన్మంతు, హరి కృష్ణ సమన్వయంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పంచగామ బీరప్ప, ఉపసర్పంచ్ మొల్ల కరిమ్, పోచమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్ మల్లయ్య ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ఎండ తీవ్రతలో ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొంటూ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, పెద్దలు, యువత, మహిళలు, ఉద్యోగస్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చలి వేంద్రం ద్వారా ప్రయాణికులు, కూలీలు, గ్రామ ప్రజలు తాగునీరు పొందుతూ ఉపశమనం పొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆర్టీసీ సమ్మెకు బీఆర్ఎస్ మద్దతు – పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధం: ఎమ్మెల్యే మాణిక్ రావు




సందేశం టైమ్స్, జహీరాబాద్, ఏప్రిల్ 24, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఆర్టీసీ డిపో వద్ద తమ సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్న కార్మికులకు బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని ఎమ్మెల్యే మాణిక్ రావు ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా కార్మికుల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో సమ్మెకు దిగాల్సి వచ్చిందని పేర్కొంటూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఆర్టీసీ సిబ్బందిని వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రైవేటీకరణ దిశగా నడిపిస్తున్నారని ఆరోపిస్తూ, కొత్త డ్రైవర్ల నియామకం లేకపోవడంతో పాత సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోందన్నారు. సమ్మె సమయంలో కాంట్రాక్ట్ డ్రైవర్లను ఉపయోగించడం ప్రజల ప్రాణాలతో ఆటలాడుకోవడమేనని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప, మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, నర్సింలు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండి మోహన్, మాజీ పట్టణ అధ్యక్షుడు యాకూబ్, మున్సిపల్ కౌన్సిలర్లు గౌస్ గౌరీ, దీపక్, విశ్వేశ్వర్, ప్రవీణ్, సర్పంచులు మచ్చేందర్, మోహన్ రాథోడ్, రాథోడ్ భీమ్ రావు నాయక్, బాల్‌రాజ్, దేశెట్టి పాటిల్ తదితరులు పాల్గొన్నారు.



## దుబ్బాక ఆర్టీసీ డిపో వద్ద సమ్మెకు ఎంపీ రఘునందన్ రావు సంఘీభావం

సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 24, ప్రతినిధి: మెదక్ జిల్లా దుబ్బాక ఆర్టీసీ డిపో వద్ద తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు సంఘీభావం తెలిపారు. కార్మికుల నిరసనలో పాల్గొన్న ఆయన, వారి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ, కార్మికుల పోరాటానికి తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# తెలంగాణ జాగృతిలోకి కలబ్గూర్ దయాకర్ రెడ్డి దంపతులు – కవిత సమక్షంలో చేరిక



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 24, ప్రతినిధి: సంగారెడ్డి నియోజకవర్గానికి చెందిన మాజీ బీజేపీ సీనియర్ నాయకుడు కలబ్గూర్ దయాకర్ రెడ్డి (కేడీఆర్) మరియు ఆయన సతీమణి సంఘమిత్ర, కల్వకుంట్ల కవిత పిలుపు మేరకు తెలంగాణ జాగృతిలో చేరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కవిత వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆత్మగౌరవం, సమాజ అభివృద్ధి కోసం జాగృతి కృషి కొనసాగుతుందని ఆమె పేర్కొన్నారు. కొత్తగా చేరిన నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కేడీఆర్ యువసేన సభ్యులు గోపాల్ రెడ్డి, మనోజ్ రెడ్డి, గోపాల్ యాదవ్, నరసింహ రెడ్డి, నాగేశ్, ఆనంద్ యాదవ్, నవీన్, హేమ, రాకేష్ గుప్తా తదితరులు సుమారు 200 మంది కార్యకర్తలతో పాల్గొన్నారు. తెలంగాణ జాగృతి నాయకుడు బాలయ్య సహా ఇతర ప్రముఖులు కూడా హాజరయ్యారు.



# తెలంగాణ జాగృతిలోకి మాజీ జడ్పీ చైర్మన్ బాలయ్య కవిత సమక్షంలో చేరిక

సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 24, ప్రతినిధి: ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బాలయ్య, తెలంగాణ జాగృతి పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో జాగృతి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ కవిత ఆహ్వానం మేరకు పార్టీలో చేరానని, ప్రజల కోసం మరియు పార్టీ బలోపేతానికి మరింత ఉత్సాహంగా పనిచేస్తానని తెలిపారు. తమపై నమ్మకం ఉంచి పార్టీలో చేరినందుకు బాలయ్యను కవిత అభినందిస్తూ, పార్టీలో ఆయనకు తగిన స్థానం కల్పిస్తామని పేర్కొన్నారు.

# విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకం: జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 24, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత ముఖ్యమని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. సంక్షేమ వారోత్సవాల సందర్భంగా జోగిపేటలోని మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆమె పాల్గొని పాఠశాల సదుపాయాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పిల్లల చదువుపై నిరంతరం శ్రద్ధ పెట్టాలని, పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు సూచనలు అందించాలని సూచించారు. విద్యార్థుల ఇంగ్లీష్ నైపుణ్యాల పెంపు కోసం ప్రతిరోజూ ఒక గంట ఇంగ్లీష్‌లో మాట్లాడే విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నదని తెలిపారు. ప్రతి నెల పేరెంట్స్ మీటింగ్‌కు హాజరై పిల్లలతో కలిసి భోజనం చేసేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్, ప్రిన్సిపాల్ రజని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో కల్తీ టీ పౌడర్ దందా బట్టబయలు – 4 టన్నుల స్వాధీనం, 10 మంది అరెస్ట్




సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రతినిధి: హైదరాబాద్ నగరంలో టీ ప్రియుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతూ సాగుతున్న భారీ కల్తీ టీ పౌడర్ దందాను పోలీసులు బట్టబయలు చేశారు. రహస్య సమాచారం మేరకు హెచ్-ఫాస్ట్ పోలీసులు నిర్వహించిన మెరుపు దాడుల్లో సుమారు 4 టన్నుల కల్తీ టీ పౌడర్‌తో పాటు హానికర రసాయనాలను స్వాధీనం చేసుకున్నారు. హోటళ్లు, టీ స్టాళ్లలో వాడి పారేసిన టీ పొడిని సేకరించి దానికి కృత్రిమ రంగులు, వాసనలు కలిపి మళ్లీ ప్యాక్ చేసి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ కేసులో 10 మందిని అరెస్ట్ చేయగా, కల్తీ తయారీదారులతో పాటు తెలిసికొని కొనుగోలు చేసిన కొంతమంది టీ షాప్ యజమానులు కూడా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కల్తీ పదార్థాలు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు కారణమయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.




# పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో ఘనంగా విద్యాప్రవేశ్ కార్యక్రమం

సందేశం టైమ్స్, ఖమ్మం, ఏప్రిల్ 24, ప్రతినిధి: ఖమ్మం నగరంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఒకటవ తరగతిలో కొత్తగా చేరిన విద్యార్థుల కోసం విద్యాప్రవేశ్ కార్యక్రమాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో జరిగిన ఈ వేడుకకు నూతన విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి హాజరయ్యారు. చిన్నారుల విద్యా ప్రస్థానంలో తొలి అడుగును ఆహ్లాదకరంగా మార్చే ఉద్దేశంతో వారికి విజ్ఞానం, జిజ్ఞాస, ఆనందాన్ని పంచుతూ ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రతినిధులు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం చిన్నారుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఇది శుభారంభమని పేర్కొన్నారు. పిల్లలు పాఠశాల వాతావరణానికి అలవాటు పడేలా ఆటపాటలు, వివిధ కృత్యాలతో కూడిన ప్రత్యేక ప్రణాళికను కూడా వివరించారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ నరేంద్ర కుమార్, ప్రైమరీ ఇంచార్జి అశోక్ కుమార్, అడ్మిషన్ ఇంచార్జి ఉపేంద్ర నాయక్, సీనియర్ ప్రైమరీ ఉపాధ్యాయులు సందీప్, కిరణ్ కుమార్, నసీరుద్దీన్ బాబా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీమంతం, అన్నప్రసన్నం, అక్షరాభ్యాస వేడుకలు





సందేశం టైమ్స్, చింతకాని మండలం, ఏప్రిల్ 24, ప్రతినిధి: చింతకాని మండల కేంద్రంలోని చింతకాని గ్రామంలో సర్పంచ్ కిలారు మనోహర్ బాబు ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం, ఆరు నెలల పిల్లలకు అన్నప్రసన్నం, 30 నెలల పిల్లలకు అక్షరాభ్యాస వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో చుంచు శ్రీనివాసరావు, తహసిల్దార్ బాబ్జి ప్రసాద్, ఐసిడిఎస్ సిడిపిఓ కమలప్రియ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించగా, తహసిల్దార్ బాబ్జి ప్రసాద్ అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని గర్భిణీలు తప్పకుండా తీసుకోవాలని సూచించారు, అలాగే సిడిపిఓ కమలప్రియ మాట్లాడుతూ అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, బాల్యవివాహాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా 15 మంది గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం వేడుకలు నిర్వహించడం సంతోషకరమని నిర్వాహకులు తెలిపారు. సర్పంచ్ కిలారు మనోహర్ బాబు మాట్లాడుతూ పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఈ వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు మరియు అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన సదుపాయాలు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి, ఉపసర్పంచ్ కొల ఉమారాణి, గ్రామ పెద్దలు కిలారు జగన్మోహన్ రావు, మాజీ సర్పంచ్ కిలారు సరోజిని, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, పిల్లల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ రెండో రోజు సమ్మెకు బీఆర్ఎస్ సంఘీభావం – లింగాల కమల్ రాజు మద్దతు



సందేశం టైమ్స్, మధిర, ఏప్రిల్ 24, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ కొనసాగిస్తున్న సమ్మె రెండో రోజుకు చేరగా, మధిర డిపో వద్ద జరుగుతున్న ఆందోళనకు బీఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇంచార్జ్ లింగాల కమల్ రాజు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వం ఆర్టీసీ మనుగడ కోసం విలీనంపై జీవో ఇచ్చిందని గుర్తు చేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలు అమలు చేస్తామని చెప్పి రెండున్నర సంవత్సరాలు గడిచినా సమస్యలు పరిష్కరించలేదని విమర్శించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు కార్మికుల న్యాయమైన కోరికలు వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ, సమ్మెకు తమ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మధిర పట్టణ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లపోతు వెంకటేశ్వరరావు, అరిగే శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు యన్నంశెట్టి వెంకట అప్పారావు, పరిశ శ్రీనివాసరావు, బత్తుల శ్రీనివాసరావు, చీదిరాల రాంబాబు, ఆర్టీసీ రాష్ట్ర మాజీ నాయకుడు ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

# విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు



సందేశం టైమ్స్, చింతకాని మండలం, ఏప్రిల్ 24, ప్రతినిధి: చింతకాని మండల పరిధిలోని నేరడ గ్రామంలో సీతారామచంద్రస్వామి, వేణుగోపాలస్వామి, వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించగా ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ధార్మిక కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. ఈ కార్యక్రమంలో చింతకాని మండల మాజీ వైస్ ఎంపీపీ గురజాల హనుమంతరావు, మండల కార్యదర్శి వెంకట రామారావు, మాజీ మండల రైతు కన్వీనర్ పొనుగోటి రత్నాకర్, మండల యువజన విభాగం అధ్యక్షులు పిన్నెల్లి శ్రీనివాస్, మండల నాయకులు గడ్డం శ్రీను, ఆలస్యం శంకర్, చాట్ల సురేష్, ఆలస్యం మధు తదితరులు పాల్గొన్నారు.



## విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న మల్లు నందిని దేవాలయంలో ప్రత్యేక పూజలు

సందేశం టైమ్స్, చింతకాని మండలం, ఏప్రిల్ 24, ప్రతినిధి: చింతకాని మండల పరిధిలోని నేరడ గ్రామంలో గురువారం నాడు నూతన శ్రీ సీతారామచంద్ర స్వామి, శ్రీ వేణుగోపాల స్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం మరియు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించగా తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నేరడ గ్రామ సర్పంచ్ దూసరి నేతాజీ ఆలయ నిర్మాణం గురించి ఆమెకు వివరించగా ఆమె పూజా కార్యక్రమంలో పాల్గొని దేవాలయ అభివృద్ధిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, ఆత్మ కమిటీ సభ్యులు కొప్పుల గోవిందరావు, ఖమ్మం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మడుపల్లి భాస్కర్ గౌడ్, సీపీఐ సీనియర్ నాయకులు దూసరి శ్రీరాములు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్, చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్, సీపీఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, నేరడ ఉపసర్పంచ్ బాలేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మంకెన నాగేశ్వరరావు, కొల్లి గోవిందరావు, బందెల నాగార్జున, పర్సగాని సతీష్, బండి శైదేశ్వరరావు, మల్లెల వెంకటేశ్వర్లు, కిలారు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో ముఖ్య అతిథిగా కొప్పుల శేషారెడ్డి





సందేశం టైమ్స్, అల్లాదుర్గం, ఏప్రిల్ 24, ప్రతినిధి: అందోల్ నియోజకవర్గం అల్లాదుర్గం మండల కేంద్రంలోని బహిరన్ దిబ్బ గ్రామంలో నిర్జెపుల బేత్తయ్య ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుక ఘనంగా నిర్వహించగా అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు నిర్మాణ పనులపై అవగాహన కల్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో ప్రతి పేదవానికి సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆత్మగౌరవంతో కూడిన నివాసం కల్పించడమే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం తరపున రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వీరప్ప, మాజీ సర్పంచ్ కోర్మని ప్రభు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర హైకోర్టు తీర్పు నేపథ్యంలో కేసీఆర్, హరీష్ రావు చిత్రపటానికి పాలాభిషేకం – మాజీ మంత్రి సునీత లక్ష్మారెడ్డి



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 24, ప్రతినిధి: రాష్ట్ర హైకోర్టు తీర్పు అనంతరం నర్సాపూర్ పట్టణ కేంద్రంలోని చౌరస్తాలో బీఆర్ఎస్ శ్రేణులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పాల్గొని మాట్లాడుతూ PC గోష్ కమిషన్ నిర్ణయాలపై న్యాయస్థానాలు స్పష్టత ఇచ్చాయని, రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఎవరైనా వ్యవహరిస్తే కోర్టులు సహించవని పేర్కొన్నారు. సెక్షన్ 8 కింద సంబంధిత వ్యక్తులకు నోటీసులు ఇవ్వకుండా ఆరోపణలు చేయడం సరికాదని హైకోర్టు వ్యాఖ్యానించడం కీలకమని ఆమె తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతో కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీయాలని ప్రయత్నించిందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్ని కమిషన్లు వేసినా కేసీఆర్, హరీష్ రావు నిజాయితీపై ఎటువంటి మచ్చ రాలేదని, కోర్టు తీర్పుతో అది స్పష్టమైందని ఆమె పేర్కొన్నారు. గోదావరి ప్రవాహం ఉన్నంత వరకు కేసీఆర్ చరిత్రను ఎవరూ చెరపలేరని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్టీసీ సమ్మెకు సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 24, ప్రతినిధి: నర్సాపూర్‌లో ఆర్టీసీ కార్మికులు కొనసాగిస్తున్న సమ్మెకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి సంఘీభావం తెలిపారు. నర్సాపూర్ డిపో వద్ద కార్మికులతో కలిసి ఆమె ర్యాలీ నిర్వహించి సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## MLA గూడెం మహిపాల్ రెడ్డిని పరామర్శించిన MLA చింత ప్రభాకర్



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 24, ప్రతినిధి: హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గారిని సంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మహిపాల్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకుని ప్రజాసేవలోకి తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులు రోగులకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలి – జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్





సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 24, ప్రతినిధి: ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు రోగులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు. గురువారం హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి ఆకస్మిక తనిఖీ చేసిన ఆయన, డాక్టర్లు అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు వైద్యులు సమయానికి ముందే విధుల నుంచి వెళ్లిపోవడాన్ని గమనించి వివరాలు ఆరా తీశారు. అనంతరం డయాలసిస్ కేంద్రం, బ్లడ్ బ్యాంక్, అత్యవసర విభాగం, ఓపీ విభాగం, బ్లడ్ స్టోరేజ్ విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలను సమీక్షించారు. గర్భిణీలు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సాధారణ ప్రసవాలు పెరిగేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆసుపత్రి పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్ శానిటేషన్ సిబ్బంది, నర్సింగ్ సిబ్బందిని అభినందించారు. నూతనంగా నిర్మిస్తున్న ఓపీ బ్లాక్ పనులను వేగవంతం చేయాలని, టి-హబ్ నిర్వహణలో ఉన్న లోపాలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఆర్ఎంఓ డాక్టర్ రవికుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ వనజ, వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.




## అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు త్వరలో అందజేస్తాం – జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 24, ప్రతినిధి: అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీపై ఉందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం తన చాంబర్లో జరిగిన జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ పరిచయ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు గుర్తింపు కార్డులు అందేలా కమిటీ పారదర్శకంగా పని చేయాలని సూచించారు. ఈనెల 24వ తేదీ శుక్రవారం సాయంత్రం లోగా దరఖాస్తు చేయని పాత్రికేయులు వెంటనే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుచరిత, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దర్శనం మల్లేశం, జిల్లా పౌర సంబంధాల అధికారి వల్లోజి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


## ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఇందిరమ్మ ఇళ్ల పనులు పరిశీలించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 24, ప్రతినిధి: సూర్యాపేట జిల్లా మునగాల మండలం బరకత్ గూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. తేమ శాతం, మట్టి గడ్డలు లేకుండా నాణ్యమైన ధాన్యం తీసుకురావాలని తెలిపారు.

అదే విధంగా హుజూర్‌నగర్ మండల కేంద్రంలోని రామస్వామి గుట్ట వద్ద 110 ఎకరాల్లో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌసింగ్ కాలనీని కూడా కలెక్టర్ పరిశీలించారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ కాలనీ ప్రారంభం కానుందని తెలిపారు. ఎలక్ట్రిసిటీ, స్ట్రీట్ లైట్లు, గ్రీనరీ, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల పనులను త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. మొక్కలు ఎండిపోకుండా నీరు అందించాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత రెవెన్యూ, హౌసింగ్, హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

## పటాన్చెరులో రోడ్డు ప్రమాదం – వ్యక్తి స్పాట్ డెడ్



సందేశం టైమ్స్, పటాన్చెరు, ఏప్రిల్ 24, ప్రతినిధి: ఇస్నాపూర్ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బట్టల వ్యాపారి సత్యనారాయణ (40) దుర్మరణం చెందారు. స్కూటీపై వెళ్తున్న ఆయనను వెనుక నుంచి వచ్చిన లారీ బలంగా ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి.

## యువతకు అండగా జగ్గారెడ్డి – పేపర్ బాయ్స్‌కు సైకిళ్ల పంపిణీ



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 24, ప్రతినిధి: సంగారెడ్డి పట్టణంలో 27 మంది పేపర్ బాయ్స్‌కు జగ్గారెడ్డి సైకిళ్లు పంపిణీ చేశారు. సంగారెడ్డి, మల్కాపూర్ ప్రాంతాల్లో పత్రికల ఏజెంట్లుగా పనిచేస్తూ ఉపాధి పొందుతున్న ఈ యువకులు తమ పనికి సైకిళ్లు కావాలని జగ్గారెడ్డి కార్యాలయాన్ని సంప్రదించగా, గురువారం ఆయన స్వయంగా సైకిళ్లు అందజేశారు. చదువుకుంటూ ఉపాధి పొందుతున్న వారు కొందరైతే, చదువు మధ్యలో ఆపిన వారు మరికొందరు ఉన్నారని, ఆసక్తి ఉన్న వారికి పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు. మరో 500 మంది విద్యార్థులు సైకిళ్ల కోసం నమోదు చేసుకున్నట్లు సమాచారం ఉండగా, విడతల వారీగా పంపిణీ చేస్తామని తెలిపారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.